సాక్షి కామారెడ్డి

రేపటికి ముందడుగు
మహిళా దినోత్సవం

బుధవారం । 8 । మార్చి । 2023






ఆడజన్మ ఓ వరం

- నచ్చిన రీతిలోనే జీవిస్తున్నాం.. • సాక్షి సర్వేలో మహిళల మనోగతం

మహిళా దినోత్సవం


ఆడ జన్మ ఓ వరమని, మరు జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలని ఉందని వివిధ రంగాలకు చెందిన మహిళలు, యువతులు, విద్యార్థినులు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నాలుగు ప్రశ్నలతో 'సాక్షి' నిర్వహించిన సర్వేలో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. డిగ్రీ 15, ఇంజినీరింగ్ 15, పీజీ 30 మంది విద్యార్థినులు, ప్రభుత్వ టీచర్లు 5, ప్రైవేట్ టీచర్లు 5, ఆర్టీసీ ఉద్యోగినులు 10, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగినులు 30, మొత్తం 110 మంది సర్వేలో పాల్గొన్నారు.
– నిజామాబాద్‌అర్బన్/డిచ్‌పల్లి

సర్వేలో విద్యార్థినులు, ఉద్యోగినులు వెల్లడించిన అంశాలు..




మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా..

అవును	65
లేదు	35
కొద్దిమేర	10




మహిళగా మీరు ఎక్కువగా ఇబ్బంది పడిన అంశం

చిన్నప్పుడు ఇంట్లోనే ఆడ-మగ వివక్ష	18
కాలేజీ-పని ప్రదేశం-ప్రయాణంలో టీజింగ్	71
సోషల్ మీడియా టీజింగ్	21



మళ్లీ జన్మంటూ ఉంటే.. ఎలా పుట్టాలనుకుంటారు..

మళ్లీ ఆడపిల్లగానే..	87
మగ పిల్లాడిలా..	23



మీకే పూర్తి అధికారం ఉంటే.. మహిళల కోసం ఏం చేస్తారు.

ఆడమగ వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేయటం	57
మహిళలపై హింస ఇతర రకాల నేరాలపై కఠిన శిక్షలు	29
ఆడపిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు	18
ఆడవాళ్లకు నెలలో నాలుగు రోజులు పూర్తి సెలవు (నెలసరి సమయంలో)	06

సమాజంలో ఇంకా మార్పు రావాలి



సమాజంలో ఇంకా ఎంతో మార్పు రావాల్సి ఉంది. సమాజంలో ఆడవారిపై వివక్ష తగ్గిపోవాలి. మగవారితో సమానంగా ఆడవారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి. వివక్ష పోయినప్పుడే ఆడవారిపై దాడులు తగ్గి, రక్షణ లభిస్తుంది.
– అనూష, విద్యార్థిని, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల

చదువుతోనే గౌరవం..



చదువుతోనే మహిళలపై వివక్ష తొలిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మహిళలు ఉన్నత చదువులు నేర్చుకుని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే పలు రంగాల్లో ఇంకా మహిళలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది.
– నాగమణి, తెలుగు పండిత్

మహిళలపై వివక్ష చూపొద్దు



ఈ ఆధునిక యుగంలో ఇంకా మహిళలపై వివక్ష కొనసాగుతోంది. ప్రభుత్వం, మహిళలపై దాడులను అరికట్టాలి. సమాజంలో మహిళలపై వివక్ష తొలిగినప్పుడే వారు అన్నిరంగాల్లో ధైర్యంగా మరింత రాణించగలుతారు.
– డాక్టర్ నాగసాయి దివ్య, ప్రభుత్వ వైద్యురాలు

సమాన అవకాశాలు కల్పించాలి..



మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పించాలి. అప్పుడే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లగలుగుతారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మహిళలపై వివక్ష కొనసాగుతుండటం దురదృష్టకరం.
– అరుణరాణి, ఆర్టీసీ ఉద్యోగి

న్యూస్‌రీల్

టెలిస్కోప్‌తో స్కైవాచ్



కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి ఆధ్వర్యంలో స్కైవాచ్ ఏర్పాటు చేశారు. భిక్కనూరులోని చైతన్య విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న రుషికేష్ టెలిస్కోప్ సహాయంతో గ్రహాలను చూపించారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ గ్రహాలను వీక్షించారు. వారికి చంద్రుడిపై ఉన్న బిలాలు, ఇతర గ్రహాల గురించి రుషికేష్ వివరించారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

హంపి పీఠాధిపతిని దర్శించుకున్న బండి




మోర్తాడ్: అనారోగ్యంతో బాధపడుతున్న హంపి పీఠాధిపతి [illegible] పరామర్శించారు.

అమ్మ స్ఫూర్తితో ఉన్నత స్థానానికి..

పెళ్లి తరువాత ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం

- భర్త ప్రోత్సాహంతో చదివి జడ్జిగా ఎంపికైన షౌకత్ జహాన్ సిద్ధిఖీ
- సైన్స్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి న్యాయవిద్యకు మారి లక్ష్యసాధన



సాక్షి నిజామాబాద్ యూనిట్ కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా అడిషనల్ జడ్జి షౌకత్ జహాన్ సిద్ధిఖీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో విద్యాభ్యాసం పూర్తి చేసిన తరువాత వివాహం చేసుకుని తిరిగి న్యాయవిద్య అభ్యసించి భర్త ప్రోత్సాహంతో న్యాయమూర్తిగా ఎదిగిన షౌకత్ జహాన్ సిద్ధిఖీ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నిజామాబాద్ జిల్లా అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జిగా ప్రస్తుతం పనిచేస్తున్న షౌకత్ జహాన్ సిద్ధిఖీ లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో ముందుకు వెళ్లారు. వరంగల్‌కు చెందిన షౌకత్ జహాన్ సిద్ధిఖీ తండ్రి జియావుద్దీన్ సిద్ధిఖీ యూఎస్ఏ, గల్ఫ్‌లలో ఉద్యోగాలు చేశారు. తల్లి అహ్మదీ షాజహాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ మైక్రోబయాలజీ చదివిన షౌకత్ జహాన్ సిద్ధిఖీకి తరువాత సయ్యద్ అన్వరుద్దీన్‌తో వివాహం అయింది. అయితే వివాహం తరువాత ఈమె భర్త అన్వరుద్దీన్ ప్రోత్సాహంతో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులను కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేశారు. భర్త స్ఫూర్తితో పరీక్షలకు ప్రిపేర్ అయి జడ్జిగా ఉద్యోగం సాధించారు. కాగా అన్వరుద్దీన్ జిల్లా న్యాయమూర్తిగా పనిచేశారు. వీరి పెద్ద కుమారుడు సయ్యద్ అమర్ అహ్మద్ మెకానికల్ ఇంజినీర్, చిన్న కుమారుడు బషార్ అహ్మద్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ చదివారు.

గెస్ట్ ఎడిటర్‌గా.. సంతోషంగా ఉంది

- ఇలాంటి నూతన విధానంతో మరిన్ని ఆలోచనలు వెలికివస్తాయి
- జిల్లా అదనపు న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్ధిఖీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 'సాక్షి' ఎడిషన్ కార్యాలయానికి గెస్ట్ ఎడిటర్‌గా రావడం చాలా సంతోషంగా ఉందని నిజామాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్ధిఖీ అన్నారు. మంగళవారం ఆమె నిజామాబాద్ సాక్షి యూనిట్ కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి ఇన్నోవేటివ్ కార్యక్రమాల వల్ల మన ఆలోచనలను మరింతగా వెలికి తీయవచ్చన్నారు. ఈ బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో చోటుచేసుకునే ప్రతి అంశాన్ని ప్రపంచానికి తెలియజేసే ఇలాంటి చోట పనిచేసే అవకాశం రావడం ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రతి వార్త వస్తోంది. అయితే సోషల్ మీడియాలో వచ్చే వార్తలు నిజమా కాదా అనేది తెలుసుకునేందుకు దినపత్రిక తప్పనిసరిగా చూడాల్సిందేనన్నారు.

ఆడపిల్ల భారం అనుకోవద్దు..

ఆడపిల్లలను అబ్బాయిలతో సమానంగా చూడాలని, భారం అనుకోవద్దని జిల్లా అదనపు న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్ధిఖీ అన్నారు. ఆడపిల్లలకు మంచి విద్య అందించి తగిన ప్రోత్సాహం ఇస్తే ఉన్నత స్థాయికి చేరుతారన్నారు. ఇందుకు అనేక నిదర్శనాలు ఉన్నాయన్నారు. స్వతహాగా ఆడపిల్లలు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విషయంలో గట్టిగా కృషి చేస్తారన్నారు. వారికి కొంచెం ప్రోత్సాహం ఇచ్చినా విజయం సాధిస్తారన్నారు. ఆడపిల్లల విషయంలో పెళ్లి చేసి పంపించాలనే ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలన్నారు. ఆడపిల్లలు న్యాయవాద వృత్తిలోకి సైతం ఎక్కువగా రావాలన్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లల ప్రాధాన్యత గురించి, వారి సామర్థ్యం గురించి మరింతగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మహిళల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరగాలి.

తల్లిని చూసి ప్రేరణ పొందాను..



తన తల్లి అహ్మదీ షాజహాన్ బేగం నుంచి ప్రేరణ పొంది ఈ స్థానానికి వచ్చాను. ఎందుకంటే నా తండ్రి యూఎస్ఏ, గల్ఫ్‌లో ఏళ్లతరబడి పని చేయడంతో మా ఆరుగురు పిల్లలను అమ్మే చూసుకుంది. అమ్మ ఉద్యోగం చేస్తూనే అన్ని వ్యవహారాలు చూసుకునేది. చిన్నతనం నుంచి అమ్మను చూస్తూ క్రమశిక్షణ అలవర్చుకున్నాను. అమ్మ స్ఫూర్తి, ప్రోత్సాహంతో ఈ స్థాయికి చేరుకున్నందుకు గర్వంగా ఉంది.
–షౌకత్ జహాన్ సిద్ధిఖీ, జిల్లా అదనపు న్యాయమూర్తి

స'భళా'!

- నవతరం వనితలు
- అన్నింటా విజేతగా ఆమె
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



స్త్రీ శక్తి స్వరూపిణి.. ఓర్పు, నేర్పుకూ ఆమె చిరునామా.. కష్టాలెన్నెదురైనా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతూ ఎన్నో విజయాలను సాధిస్తోంది. జిల్లాకు చెందిన నారీమణులు దాదాపు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతూ తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో పలువురి సక్సెస్ స్టోరీ.. – సాక్షి, కామారెడ్డి

బాధితులకు భరోసా ఇస్తున్న రచనారెడ్డి



నాగిరెడ్డిపేటకు చెందిన రచనారెడ్డి హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఐదేళ్ల క్రితం మల్లన్నసాగర్ ముంపు బాధిత రైతుల పక్షాన హైకోర్టులో ఆమె వాదించారు. దీంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. ఆమె వాదనతో అసహనానికి గురైన సీఎం కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా రచనారెడ్డి పేరును ప్రస్తావించారు. ఆమె రైతుల పక్షాన కోర్టులో కేసులు వేసి కొట్లాడడమే గాకుండా వారు చేస్తున్న ఉద్యమాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాల సమయంలో భూములు కోల్పోతున్న వారి పక్షానా పోరాడుతున్నారు. తెలంగాణ జనసమితిలో కొన్నాళ్లు పనిచేసిన రచనారెడ్డి.. తర్వాత బీజేపీలో చేరారు.

అన్నింటా ముందున్న సుమంగళ



రామారెడ్డికి చెందిన జంగం సుమంగళ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఎన్నో మెడల్స్ సాధించారు. బీఈడీ, పీజీ పూర్తి చేశాక డీఎస్సీ ద్వారా ఎస్జీటీ ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు. ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్ పోస్టుకు సెలెక్ట్ అయ్యి ప్రస్తుతం హయత్‌నగర్ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకురాలిగా తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘంలోనూ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

ఉద్యమకారిణి సుమిత్రానంద్



కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన సుమిత్రానంద్ మహిళల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారు. గృహహింసకు గురయ్యే మహిళలకు అండగా నిలిచారు. ఉపాధ్యాయ సంఘం నాయకురాలిగా తెలంగాణ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. రచయితగా, గాయకురాలిగానూ గుర్తింపు పొందారు. ఆమెను సీఎం కేసీఆర్ 2021 లో టీఎస్పీఎస్సీ సభ్యురాలిగా నియమించారు. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యురాలిగా సేవలందిస్తున్నారు.



గాంధారి మండలం చద్మల్ తండాలో లాఠీ మార్ హోలీ ఆడుతున్న తండావాసులు

రంగ్ బర్‌సే..

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం: జిల్లాలో మంగళవారం హోలీ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వసంతోత్సవంలో పాల్గొన్నారు. చిన్నారులు ఉదయం నుంచే ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. గాంధారి మండలం చద్మల్ తండాలో గిరిజన మహిళలు, పురుషులు కర్రలు చేత పట్టుకుని లాఠీమార్ హోలీ వేడుకలు జరుపుకున్నారు. కలెక్టరేట్ సమీపంలోని ప్రకృతి వనంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోలీ పండుగ సందర్భంగా ఒకరిపై ఒకరు చల్లుకునేవి రంగులు కాదని, అనురాగ, ఆప్యాయతలని పేర్కొన్నారు. ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు, ప్రతినిధులు దయానంద్, సతీష్ యాదవ్, దేవరాజు, నీలి లింగం, ఉద్యోగులు పాల్గొన్నారు.



ట్రైనీ కలెక్టర్‌కు రంగులు పూస్తున్న కలెక్టర్ పాటిల్, పక్కన అదనపు కలెక్టర్ ధోత్రే

నేడు మంత్రి వేముల పర్యటన



సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెఫరల్ సెంటర్, హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. అనంతరం కళాభారతిలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీ నిధుల చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జింకకు గాయాలు



తాడ్వాయి: ఎర్రాపహాడ్ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక జింకకు గాయాలయ్యాయి. జింక రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు దీనిని గమనించి అధికారులకు సమాచారాన్ని అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని జింకకు చికిత్స అందించారు.

క్లుప్తంగా

గున్కుల్‌లో ఇల్లు దగ్ధం



నిజాంసాగర్: మండలంలోని గున్కుల్‌లో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పెంకుటిల్లు పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన కుర్మ అంబవ్వ, కుర్మ సాయవ్వ ఒకే ఇంట్లోని రెండు భాగాల్లో ఉంటున్నారు. మంగళవారం ఉదయం వారు వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం వేళ ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు యత్నించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. రూ.లక్షనర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

పోతారంలో గొర్ల కొట్టాలు..



మాచారెడ్డి: మండలంలోని పోతారంలో మంగళవారం ఐదు గొర్ల కొట్టాలు కాలిపోయి రూ.మూడు లక్షల వరకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన జంగంపల్లి రాజయ్య, చిన్న రాజయ్య, లింగం, శివరాజు, మల్లేష్ అన్నదమ్ములు. వీరు ఇటీవల గొర్లతో మన్నెం వెళ్లారు. వరుసగా నిర్మించిన కొట్టాలు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

లారీ పట్టివేత



నస్రుల్లాబాద్ (బీర్కూర్): బీర్కూర్‌లో సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన రోషన్ అనే యువకుడిని ఢీకొన్న లారీని పోలీసులు పట్టుకున్నారు. నిద్ర మత్తులో చెరుకు లారీ నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మాగి నుంచి మహారాష్ట్రకు వెలుతున్న లారీ ఢీకొనడంతో రోషన్ చనిపోయాడని చెప్పారు. బీర్కూర్‌లో సీసీ కెమెరాలను పరిశీలించి లారీని పట్టుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



గాంధారి: మండలంలోని తిప్పారంలో సోమవారం రాత్రి పొలాల వద్ద గల రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగ, ఆయిల్‌ను చోరీ చేశారు. రోజుకో గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పోరులో సగభాగం!

- బంధాలను తెంచుకుని అడవిబాట
- సమానత్వం కోసం సాయుధ పోరాటం
- నేల రాలిన అరుణతారలెందరో...
- అజ్ఞాతంలో మరి కొందరు

సాక్షి , కామారెడ్డి : వివక్ష, హింస, అణచివేతల నుంచి విముక్తి కోసం మహిళలు ఎందరో సాయుధ పోరులో భాగమయ్యారు. సమ సమాజాన్ని వాగ్దానం చేస్తూ తల్లిదండ్రులతో ఉన్న పేగు బంధాన్ని, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లతో రక్త సంబంధాన్ని, స్నేహితులతో స్నేహబంధాన్ని తెంచుకుని మరీ అడవిబాట పట్టారు. బందూకులు చేతబట్టి పురుషులతో సమానంగా రాజ్యంతో జరిగిన యుద్ధంలో తమ ప్రాణాలను వదిలారు. ఇప్పటికీ ఎంతో మంది మహిళలు అజ్ఞాతంలో కొనసాగుతున్నారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా మావోయిస్టు పార్టీ (నాటి పీపుల్స్‌వార్)లో పనిచేసి అసువులు బాసిన మహిళలపై కథనం. నక్సల్బరీ స్ఫూర్తితో శ్రీకాకుళం నుంచి జగిత్యాల, సిరిసిల్ల రైతాంగ పోరాటాలతో సాయుధ నక్సలైట్ ఉద్యమం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తరించింది. 1990 వ దశకంలో కొన్ని ప్రాంతాల్లో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. అయితే నక్సలైట్ ఉద్యమాలపై నాటి పాలకులు పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడడంతో ఎంతో మంది ప్రాణాలొదిలారు. 1993 లో అప్పటి పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శి పులి అంజన్నతో పాటు ఆయన భార్య భాగ్యక్క అసువులు బాసింది. ఆ తరువాత ఎంతో మంది అజ్ఞాత నక్సల్స్ ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. వారిలో మహిళలు ఎంతో మంది ఉన్నారు. స్నేహలత, కరుణ, భారతి, పద్మ, లక్ష్మి, సుశీల, నర్సక్క, జ్యోతక్క, రుక్కుబాయి, పద్మక్క, లలిత, సక్కుబాయి, జరీనాబేగం, సాయవ్వ, సులోచన, మానసలు... ఇలా ఎందరో మహిళా నక్సలైట్లు ఉద్యమంలో అసువులు బాసారు.



సులోచన అలియాస్ లక్ష్మి , ఇస్రోజీవాడి(ఫైల్)



మానస, ఇస్రోజీవాడి(ఫైల్)

మానాలలో మహిళా అమరుల స్మారక స్థూపం...

విప్లవోద్యమంలో అమరులైన మహిళా అమరుల స్మారక స్థూపాన్ని మానాలలో 1997 సెప్టెంబర్ 25 న ఆవిష్కరించారు. అప్పటికే చనిపోయిన 40 మంది మహిళా నక్సల్స్‌ను స్మరిస్తూ 48 అడుగుల ఎత్తైన భారీ స్థూపాన్ని నిర్మించారు. ఇది ఆసియా ఖండంలోనే రెండోదిగా చెబుతారు. ఉద్యమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి అప్పటికే 11 మంది చనిపోయారు. నర్సక్క, జ్యోతి అలియాస్ స్వరూప, రుక్కుబాయి అలియాస్ విజయ, పద్మక్క అలియాస్ విజయలక్ష్మి, లలిత అలియాస్ పుష్ప, సక్కుబాయి అలియాస్ అరుణ, హసీనాబేగం, విజయలక్ష్మి, పద్మక్క అలియాస్ విజయ, జరీనాబేగం, సాయవ్వలు ఉద్యమంలో చనిపోయారు. తరువాత స్వరూప అలియాస్ మొర్రి లస్మవ్వ, మానస అలియాస్ మణెమ్మ, మానస అలియాస్ రజిత తదితరులు చనిపోయారు. కాగా కామారెడ్డి జిల్లాలోని ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన స్వామి అలియాస్ లోకోటి చందర్ సీపీఐ మావోయిస్టు పార్టీలో దండకారణ్యంలో పనిచేస్తున్నాడు. ఆయనతో పాటే ఆయన భార్య సులోచన అలియాస్ నవత అడవి బాట పట్టింది. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో దండకారణ్యంలో చనిపోగా, అక్కడే అంత్యక్రియలు జరిగాయి. కాగా స్వామి కూతురు లావణ్య కూడా తండ్రిబాటలోనే ఉద్యమంలో కొనసాగుతోంది. అదే గ్రామానికి చెందిన అమర్ ఆయన కూతురు మానసలు విప్లవోద్యమంలో పనిచేసి వేర్వేరు ఎన్‌కౌంటర్లలో అసువులు బాసారు.



మానాలలో మహిళా మావోయిస్టుల స్మారక స్థూపం

ఏటా మహిళా దినోత్సవం..

మహిళా దినోత్సవం

తెలంగాణ జిల్లాల్లో నక్సలైట్ ఉద్యమం కొనసాగిన సమయంలో ఏటా అడవుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. వారం రోజుల పాటు మహిళలను సమీకరించి అనేక సభలు, సమావేశాలు జరిగేవి. అందులో భాగంగానే మానాలలో స్థూప నిర్మాణం జరిగింది. అంతేగాక మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడిన వారిపై అప్పట్లో నక్సలైట్లు ప్రజాకోర్టులు నిర్వహించి దండించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అనేక ఉద్యమాల్లో మహిళలు భాగస్వాములు కావడానికి అప్పట్లో నక్సలైట్లు అందించిన స్ఫూర్తి కారణమని చెబుతారు. ఇప్పటికీ తెలంగాణ జిల్లాల నుంచి పలువురు అజ్ఞాతంలో కొనసాగుతున్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన లావణ్య దండకారణ్యంలో పని చేస్తోంది. ఆమెతో పాటు మరికొందరు కూడా అజ్ఞాతంలో ఉన్నట్టు సమాచారం. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన మహిళలు పలువురు విప్లవోద్యమంలో కొనసాగుతున్నారు. దండకారణ్యంలో నడుస్తున్న జనతన సర్కారులో తెలంగాణకు చెందిన పలువురు మహిళా నక్సలైట్లు కీలక భూమిక పోశిస్తున్నట్టు తెలుస్తోంది.

క్యాన్సర్‌ను ఎదురించి..

- ప్రజాసేవ చేస్తున్న ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వినీత



కుటుంబంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వినీత

ఆర్మూర్‌టౌన్: క్యాన్సర్ సోకినా కుంగిపోలేదు.. ఓ వైపు చికిత్స పొందుతూ.. మరోవైపు ప్రజాసేవలో తరించారు. వ్యాధి ఇబ్బంది పెడుతున్నా.. పట్టణ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.. ఆర్మూ ర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్. ఆమె 2006లో పండిత్ పవన్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత ఓ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు రాజకీయాల్లో ఉండటంతో భర్త పవన్ సూచన మేరకు మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా 2020 జనవరి 31న బాధ్యతలు చేపట్టారు. ఆర్మూర్ అభివృద్ధికి తన వంతు చర్యలు చేపట్టారు. అంత సాఫీగా సాగుతున్న తరుణంలో విధి వక్రీకరించింది. 2021 జూన్‌లో ఆమెకు క్యాన్సర్ నిర్ధారణ అయింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇచ్చిన ధైర్యంతో తొమ్మిది నెలలు చికిత్స పొందారు. ఓ వైపు చికిత్స పొందుతూనే ప్రజలకు అందుబాటు ఉన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారు.

ప్రియురాలి కోసమే హత్య..

- కల్లు తాగించి స్నేహితుడిని హతమార్చిన యువకులు
- 16 నెలల క్రితం హత్య
- మృతుడి తల్లి ఫిర్యాదుతో ఘటన వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

నందిపేట్(ఆర్మూర్) : నందిపేట మండలం ఆంధ్రనగర్ గ్రామం వెంకటేశ్వర కాలనీకి చెందిన సొతురి కార్తీక్ (21) నందిపేట శివారు పలుగుట్ట ప్రాంతంలో బండరాళ్ల మధ్య హత్యకు గురై అస్థిపంజరం రూపంలో బయటపడ్డ విషయం తెలిసిందే. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు హత్య కేసుని ఛేదించి హత్యకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేశారు. మంగళవారం నందిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు హత్య ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సొతురి కార్తీక్ 2021 సెప్టెంబర్ 20వ తేదీనుంచి కనిపించకపోవడంతో ఆంధ్రా వెళ్లి పని చేసుకుంటున్నాడని భావించారు. కానీ అదే గ్రామానికి చెందిన బాపట్ల రాజు, ఆయన వరుసకు చిన్నమ్మ కొడుకైన బొజ్జ హరీశ్‌తో కలిసి పలుగుట్ట ఎల్లమ్మ ఆలయం దగ్గర కల్లు తాగించి నిర్మానుష్య ప్రాంతంలో కొట్టి చంపి బండరాళ్ల మధ్యలో పడేశారు. నిందితుల్లో ఒకరైన రాజు ప్రేమించిన అమ్మాయిని కార్తీక్ కూడా ప్రేమిస్తున్నాడనే అనుమానంతో కార్తీక్‌ను చంపేసినట్లు తాగిన మైకంలో వారు తమ మిత్రులతో పేర్కొనగా వారు మృతుడి తల్లికి సమాచారమిచ్చారు. దీంతో ఆమె ఈనెల 28వ తేదీన నందిపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని అస్తి పంజరంను గుర్తించి ఫోరెన్సిక్ నిపుణుడు నాగమోహన్ రావు సమక్షంలో స్పాట్ పోస్టుమార్టం చేయించారు. మంగళవారం నందిపేట మండలంలోని కొల్పూర్ గ్రామంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు నిందితుల్ని గుర్తించి పట్టుకున్నామని ఏసీపీ ప్రభాకర్ పేర్కొన్నారు. పోలీసులకు నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాను ప్రేమించిన అమ్మాయిని కార్తీక్ కూడా ప్రేమిస్తున్నాడని, కార్తీక్‌ను అడ్డు తొలగిస్తే తను ప్రేమించే అమ్మాయిని పెళ్లి చేసుకోవచ్చని బాపట్ల రాజు తన తమ్ముడు బొజ్జ హరీశ్ సాయంతో పథకం ప్రకారం నందిపేట శివారు ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కెనాల్ ప్రాంతాన్ని తీసుకెళ్లారన్నారు. కల్లు తాగించి కర్రతో కొట్టి ఛాతిపై తన్ని చంపేశారన్నారు. అనంతరం దగ్గరలో ఉన్న రాళ్లలో పడేసి వెళ్లారని నిందితులు విచారణలో తెలిపారని ఏసీపీ ప్రభాకర్ రావు వివరించారు. హత్యానంతరం ఇద్దరు యువకులు మెట్‌పల్లి వైపు వెళ్లి కూలీ పని చేసుకుంటున్నారని, వీరిద్దరూ తాగిన మైకంలో స్నేహితులతో హత్య విషయం చెప్పడంతో ఘటన బయట పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, నందిపేట ఎస్సై శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నందిపేట పోలీస్ స్టేషన్‌లో హత్య వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్ రావు

సేద్యానికి చేయూత!

- వ్యవసాయ శాఖలో సగం మంది మహిళలే..
- డీఏవో, నలుగురు ఏడీఏలు, నలుగురు ఏవోలు, 64 మంది ఏఈవోలు



ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్న ఏఈవో (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: పొలం పనిలో మహిళలదే అగ్రభాగం. విత్తనం వేయడం నుంచి నాటు, కలుపు, కోత వరకూ అన్ని పనుల్లోనూ మహిళలు శ్రమిస్తారు. ఇదే సమయంలో సేద్యానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిచండంతో పాటు ప్రభుత్వ పథకాలను రైతులకు చేర్చే విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి కీలక పాత్ర. వ్యవసాయ శాఖలోనూ జిల్లాలో మహిళలే సగభాగం ఉన్నారు. జిల్లాలో అధికారులు, సిబ్బంది మొత్తం కలిపి 150 మంది ఉండగా, అందులో సగం మంది మహిళలే ఉన్నారు. జిల్లా వ్యవసాయాధికారిగా భాగ్యలక్ష్మి, నలుగురు ఏడీఏలు, నలుగురు ఏవోలు మహిళలు ఉన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పనిచేసే గ్రామ విస్తీర్ణాధికారులు 64 మంది మహిళలు ఉన్నారు. విత్తనాలు, ఎరువుల సప్లయి నుంచి మొదలుకుంటే రైతులు పంటల సాగుకు అవసరమైన సలహాలు సూచనలు చేస్తూ వారికి చేయుతగా నిలుస్తున్నారు. మహిళా ఉద్యోగులు మారుమూల ప్రాంతాల్లో కూడా విధులు నిర్వహిస్తూ రైతుల మన్ననలు అందుకుంటున్నారు.

పథకాలను రైతుకు చేర్చడంలో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి, రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు వారికి చేర్చడంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందే కీలకం. అందు కోసం ప్రభుత్వం ఐదు వేల ఎకరాలకు సాగు భూమి లెక్కన ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి, దానికి ఒక వ్యవసాయ విస్తీర్ణాధికారిని నియమించింది. కాగా జిల్లాలో 104 క్లస్టర్లు ఉన్నాయి. రైతులు పంటలు సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా నుంచి మొదలుకొంటే పంట నమోదు వరకూ వ్యవసాయ అధికారులు, సిబ్బంది చూసుకోవాలి. తరువాత పంటలను ఆశించే చీడ పీడలు, తెగుళ్ల విషయంలో సలహాలు సూచనలు అందించడం, ప్రకతి వైపరీత్యాలతో పంటలు దెబ్బ తిన్నపుడు నష్టాలను రికార్డు చేసి అధికారులకు నివేదించడం వారి బాధ్యతే. పంట చేతికి రాకముందే కొనుగోళ్లకు సంబంధించిన వ్యవహారంలోనూ వ్యవసాయ శాఖ కీలకంగానే పనిచేస్తుంది. దీనికి తోడు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు సీజన్‌కు రూ.5 వేల చొప్పున అందిస్తోంది. పంటల సాగు వివరాలు నమోదు చేసిన దాని ఆధారంగానే పెట్టుబడి సాయం అందుతుంది. అలాగే రైతుల వివరాలను ఇన్సూరెన్సు నమోదు చేయించాల్సి ఉంటుంది. ఎవరైనా రైతు చనిపోతే రైతుబీ మా ద్వారా సాయం అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులే చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

మహిళల సంఖ్య పెరిగింది



వ్యవసాయశాఖలో గతంలో మహిళలు కొద్ది మంది ఉండేవారు. క్రమంగా వారి సంఖ్య పెరిగి సగభాగమయ్యారు. సేద్యంలో మహిళలు ఎంత శ్రమిస్తారో, మహిళా ఉద్యోగులు కూడా తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. పొలం గట్ల వెంట తిరుగుతూ తెగుళ్లకు ఏ మందులు వాడాలన్నదానిపై రైతుకు అవగాహన కల్పిస్తారు.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైతులకు సేవలందిస్తున్నారు



రైతులకు సేవలందించే విషయంలో మహిళా ఉద్యోగులు ముందుభాగాన నిలుస్తారు. క్షేత్ర స్థాయిలో సగం మంది మహిళలే ఉన్నారు. పంటల సాగు విస్తీర్ణం నమోదు చేయడం నుంచి సలహాలు, సూచనలు అందించే విషయంలోనూ మహిళా ఉద్యోగులు ఎక్కడా వెనుకబడడం లేదు. నిత్యం రైతుల మధ్య తిరుగుతూ సేవలందిస్తున్నారు. – రత్న, ఏడీఏ, ఎల్లారెడ్డి

గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు నీటి మునిగిన వ్యక్తి మంగళవారం శవమై తేలాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని స్టేషన్‌రోడ్‌లో నివాసం ఉండే అయ్యారి రాజు(38) తన స్నేహితులు రమేష్, జనార్ధన్‌తో కలిసి ఈనెల 5న కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు వెళ్లాడు. వారంతా కలిసి అక్కడే మద్యం తాగారు. ఆ తర్వాత సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. రాజు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకుని దేవునిపల్లి పోలీసులు గజ ఈతగాల్లను రప్పించి చెరువులో గాలించారు. అయినప్పటికీ రాజు ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో రాజు మృతదేహం నీటిపై తేలింది. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో మస్కట్‌లో కామారెడ్డి వాసి మృతి



కామారెడ్డి టౌన్ : కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో నివసిస్తున్న మహ్మద్ మోమిన్(39) మస్కట్‌లో తన రూంలో గుండెపోటుకు గురై మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మస్కట్‌లో ఉన్న బంధువుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. 20 రోజుల క్రితం మోమిన్ ఉపాధి నిమిత్తం మస్కట్ దేశానికి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో వరుసగా గుండెపోటులకు గురై చనిపోతుంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా వరుసగా ముగ్గురు గుండెపోటుకు గురై మృతి చెందారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన అహ్మద్ (35), కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజి స్కూల్ ఉన్నత పాఠశాల ముందు మదర్ (40) గుండెపోటుకు గురై మృతి చెందాడు.

క్రైం కార్నర్

అత్తింటి వేధింపులతో మహిళ ఆత్మహత్య



పింకూ మృతదేహం

మాక్లూర్: భర్త, అత్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం మండలంలోని అమ్రాద్‌తండాలో చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని గుత్ప తండాకు చెదిన మాలోత్ పింకూ(26)ను అమ్రాద్‌తండాకు చెందిన హోమ్‌సింగ్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న వారి కుటుంబంలో ఏడాది క్రితం నుంచి గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో అత్త పీరుబాయి, హోమ్‌సింగ్‌ను రెచ్చగొట్టి పింకూను వేధించేలా చేసేది. ఇద్దరి వేధింపులు భరించలేక పింకూ మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి విషయం తెలిసిన తల్లిదండ్రులు తమ కూతురును చంపి ఉంటారని బంధువులతో కలిసి హోమ్‌సింగ్, పీరుబాయిపై దాడి చేసే యత్నం చేశారు. పోలీసులు తండాకు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. నార్త్ జోన్ సీఐ నరహరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. పింకూ తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన కటిక ఈశ్వర్ (49) గల్ఫ్ వెళ్లాడు. అక్కడ కంపెనీ మూసివేయడంతో రెండేళ్ల క్రితం తిరిగి వచ్చి, కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గల్ఫ్ వెళ్లడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని బాధపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తన ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరూ కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని బ్యాంక్ కాలనీకి చెందిన దినాకర్(38) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. దినాకర్ మద్యం తాగి తరుచు ఇంట్లో గొడవ పడేవాడు. చనిపోతానని బెదిరించేవాఉడ. ఈ క్రమంలో ఈ నెల 3న గొడవ పడి గుళికల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దినాకర్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉగ్రవాయిలో ఒకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసై అప్పులు పెరగడంతో వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామానికి చెందిన లచ్చమెల్ల అంజయ్య (35) మద్యానికి బానిసయ్యాడు. దీంతో అప్పులు పెరిగాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి

మోపాల్: మోపాల్‌లోని నీలంగుట్ట చెరువులో పడి గ్రామానికి చెందిన నీరగొండ నందు(15) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నందు మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం మృతదేహం నీలంగుట్ట చెరువులో తేలింది. పశువుల కాపారుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి అమ్మమ్మ గోసంగి గంగవ్వను పిలిచి అడగ్గా ఆమె గుర్తించింది. మృతుడికి తల్లిదండ్రులు లేరు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మంజీరలో పడి ఒకరు..



పోచయ్య మృతదేహం

నిజాంసాగర్: నిజాంసాగర్ సమీపంలోని చిన్నపూల్ బ్రిడ్జి వద్ద మంజీర నదిలో మంగళవారం స్నానానికి వెళ్లిన కంబపురం పోచయ్య(58) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు. నది పక్కన ఉన్న వ్యవసాయ పొలానికి వెళ్లిన పోచయ్య మధ్యాహ్నం వేళ మంజీరలో స్నానానికి వెళ్లాడు. బండరాళ్లపై నుంచి జారడంతో నదిలో పడి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య రత్నవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



జడ్జి షౌకత్ జహాన్ సిద్ధిఖీతో సాక్షి సిబ్బంది

నిజామాబాద్ జిల్లా అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జి షౌకత్ జహాన్ సిద్దిఖీ మంగళవారం 'గెస్ట్ ఎడిటర్' కార్యక్రమంలో భాగంగా డిచ్‌పల్లి మండలం నడిపల్లిలోని సాక్షి యూనిట్ ఆఫీస్‌ను సందర్శించారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. వార్తల ఎడిటింగ్, ప్రింటింగ్ గురించి తెలుసుకున్నారు.

నీ తాటికే అస్తున్న కొడుకా..?

- కొడుకుపై బెంగతో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య



గంగవ్వ (ఫైల్)

నిజామాబాద్ సిటీ : నన్నొదిలి పోయినవ్ కొడుకా.. నేను నీ తాటికే అస్తున్న... అంటూ ఆ తల్లి చెరువుతో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చెట్టంత ఎదిగిన కొడుకు మూడేళ్ల క్రితం మృతిచెందగా ఆయనపై బెంగ పెట్టుకుని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రూరల్ మండలంలోని ఖానాపూర్‌కు చెందిన పైడిపట్ల గంగవ్వ(56)కు ఇద్దరు కుమారులు. ఈమె భర్త పదేళ్ల క్రితమే మృతిచెందాడు. పెద్దకుమారుడు సాయిలు మూడేళ్ల క్రితం హోలీ పండుగకు కొద్దిరోజుల క్రితం ఫిట్స్ వ్యాధి, అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటినుంచి తల్లి కొడుకుపై బెంగ పెట్టుకుంది. మూడు రోజుల క్రితం గంగవ్వ మృతిచెందిన కొడుకు జ్ఞాపకాలనే గుర్తు చేసుకుంటూ తీవ్రమనస్తాపానికి గురైంది. దాంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఖానాపూర్ శివారులో ఉన్న గునుగుంట చెరువు వద్దకు వెళ్లి చెరువు కట్టపై తన పర్సు సెల్‌ఫోన్, చెప్పులు వదిలి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి గంగవ్వ రాత్రయినా ఇంటికి చేరుకోకపోవటంతో చిన్నకొడుకు అనిల్ పలువురిని ఆరా తీశాడు. ప్రతి ఏడాది హోలీ సందర్భంగా గ్రామంలోని మహిళలతో కలిసి హోలీ ఇనాం కోసం వెళ్లి ఉంటుందని భావించాడు. మంగళవారం ఉదయం చెరువులో చేపలు పట్టే జాలరులకు చెరువులో గంగవ్వ మృతదేహం కనిపించింది. చెరువు కట్టపై పర్సులో ఉన్న ఆమె సెల్‌ఫోన్ ద్వారా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలి అల్లుడు పైడిపట్ల దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.